

జన శ్వేతగిరి



శాలిహుండం యాత్ర కనులపండువగా సాగింది. శ్వేతగిరిపై వెలిసిన వేణుగోపాలుడు క్షీరాబ్ధిషేకాన్ని వీక్షించేందుకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. అనంతరం నిజరూప దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి స్వామికి నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయ సంప్రదాయానుసారం సుగ్గు, కొంక్యాన వంశస్థుల తొలి పూజ అందుకున్నారు. కొండపై ఉన్న వేణుగోపాలుడు, కొండ దిగువన ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులను బుధవారం ఉదయం వంశధార నదిలో చక్రతీర్థ స్నానం వైభవంగా నిర్వహించారు. - ప్రజాశక్తి, గార

నిరాశపరిచిన నిర్మలమ్మ



- 'ఉపాధి' నిధులకు కోతతో తప్పని వలసలు
- వేతనజీవులకు ఆశాభంగం
- రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి ఊసే లేదు
- ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంత ప్యాకేజీ
- బడ్జెట్‌పై అన్ని తరగతులూ పెదవి విరుపు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. కేంద్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధి, ప్రజలకు ఎటువంటి ఊరట కనిపించలేదు. విభజన చట్టం అమల్లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులను నాలుగేళ్లుగా నిలిపేసిన కేంద్ర ప్రభుత్వం, దాన్ని పునరుద్ధరిస్తుందేమోనని ఆశించినా దాని ప్రస్తావనే లేకుండా పోయింది. రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి రైల్వే లైన్ల అభివృద్ధి తప్ప కొత్త ప్రాజెక్టులు, కొత్త రైళ్లేవీ కేటాయించకపోవం మరింత నిరాశకు గురిచేసింది. ఆదాయపు పన్ను పరిమితి పెంచినట్టే పెంచి ఇతర మినహాయింపులను తొలగించింది. మొత్తం మీద అన్ని తరగతులనూ కేంద్ర బడ్జెట్ అసంతృప్తికి గురిచేసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయ పనుల్లేని సీజన్‌లో వ్యవసాయ కార్మికులు, కూలీలకు కాస్తో కూస్తో పనులు కల్పించి ఊతమిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోత పెట్టింది. 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లే కేటాయించింది. గతేడాది రూ.89,400 కోట్లు కేటాయించినప్పుడు రూ.148 కోట్లు వచ్చాయి. 2020-21 సంవత్సరంలో రూ.98,468 కోట్లు కేటాయించగా జిల్లాకు రూ.205 కోట్లు దక్కాయి. ఈ సంవత్సరం నిధుల కేటాయింపు తగ్గించడంతో ఆ మేరకు జిల్లాకు కేటాయింపులు తగ్గనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కేటాయింపుల తగ్గుదలతో ఉపాధి పనులపై తీవ్ర ప్రభావం చూపనుంది. జిల్లాలో మొత్తం 7.86 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా 6.19 మంది కూలీలు పనుల్లోకి క్రమం తప్పకుండా వస్తున్నారు. వీరందరికీ పనులు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవని అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు మౌలిక వసతుల కల్పనపైనా ప్రభావం చూపనుంది. ప్రతి ఏడాది రూ.250 నుంచి రూ.300 కోట్ల వరకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సమకూరుతున్నాయి. వీటితో గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి వినియోగించడానికి దోహదపడుతోంది. ఉపాధి చట్టానికి నిధుల కోతతో కూలీలకు పనులు తగ్గి వలసలు పెరిగే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమమవుతోంది.

ప్రస్తావన లేని వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ

రాష్ట్ర విభజన చట్టం హామీల్లో భాగంగా వెనుబడిన జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున కేటాయించాల్సింది. ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఈ నిధులు కేటాయించాల్సి ఉంది. 2015 నుంచి 2018 వరకు ప్రతి ఏడాది రూ.50 కోట్లను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం 2019 నుంచి ఆ నిధులను ఆపేసింది. తాజా బడ్జెట్‌లోనూ దాని ప్రస్తావన లేదు.

అన్నదాతలకు ఆశాభంగం

జిల్లాలో 3.90 లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 6 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తమకు రాయితీలు ప్రకటిస్తుందని భావించిన అన్నదాతలకు భంగపాటే మిగిలింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీలపై ఎదురుచూసిన రైతాంగం ఆశలపై నీళ్లు చల్లింది. పంటల మద్దతు ధరకు సంబంధించి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు ప్రస్తావనే లేదు. ప్రతి ఏడాది రైతులకు అందిస్తున్న రుణాల అంశం తప్ప గిట్టుబాటు గ్యారంటీ చట్టంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. దేశవ్యాప్తంగా సేంద్రీయ విధానాన్ని అభివృద్ధి చేస్తామంటూ ప్రకటించింది. చిరు ధాన్యాలకు ప్రోత్సాహం, వినియోగం పెంచుతామని బడ్జెట్‌లో పొందుపరిచింది. జిల్లాలో ప్రస్తుతం 25 ఎకరాల్లో చిరు ధాన్యాలను సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పంటల విస్తీర్ణం మరింత పెరగనుంది.

పిఎసిఎస్‌లపై పెత్తనం కోసమేనా?

రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలపై పెత్తనం సాగించేలా కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రస్తావన తెచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న పిఎసిఎస్‌లను మ్యాపింగ్ చేయనున్నామని పేర్కొంది. పిఎసిఎస్‌లకు నూతన బైలాస్ రూపొందించి వాటిని బహుళార్థక సంఘాలుగా తయారు చేస్తామని చెప్తోంది. జిల్లాలో ఉన్న 37 పిఎసిఎస్‌లు కంప్యూటరైజేషన్ కానున్నాయి.

పిఎం పివిటిజి మిషన్‌తో ఒనగూరేనా?

ఆదిమ తెగ గిరిజన కుటుంబాల్లో (పివిటిజి) సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రధానమంత్రి పివిటిజి మిషన్‌ను ప్రారంభిస్తామని బడ్జెట్‌లో పేర్కొంది. మిషన్ ద్వారా గిరిజన ఆవాసాల్లో గృహ నిర్మాణాలు, రక్షిత మంచినీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, రహదారి సౌకర్యం, పౌష్టికాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్తోంది.

వినపడని రైల్వే కూత

రైల్వే బడ్జెట్ అనగానే కొన్ని నెలల ముందు నుంచీ అంతా ఆసక్తిగా ఎదురుచూసేవారు. మన ప్రాంతానికి ఏమైనా కొత్త రైళ్లు వేస్తున్నారా?, గతంలో ఇచ్చిన మోడల్ స్టేషన్ల హామీకి కార్యరూపం దాలుస్తుందా? రైళ్లకు అదనపు హాల్టులు కల్పిస్తున్నారా అసలు ఏం ప్రకటిస్తారోనని ప్రజలు ఉత్కంఠగా చూశారు. ముఖ్యంగా విశాఖ రైల్వేజోన్‌పై ఏదైనా ప్రకటన వస్తుందని అంతా ఆశించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైల్వేపరంగా జిల్లాకు మొండిచేయి చూపింది. కొత్త రైళ్లు లేకపోగా జిల్లా మీదుగా వెళ్తూ ఆగకుండా వెళ్తున్న రైళ్లకు హాల్టులు కూడా దక్కలేదు. రైళ్ల పొడిగింపు, స్టేషన్ల అభివృద్ధి ప్రస్తావనే లేదు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని వీక్షించిన తర్వాత ఆ వివరాలేవీ కనిపించకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. జిల్లాలో రైల్వే లైన్ల అభివృద్ధి మినహా కొత్త ప్రాజెక్టులు, రైళ్ల ప్రకటన లేకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశ చెందారు.

వేతనజీవులకు నిరాశే

పన్నుల విషయంలో ఈ ఏడాది బడ్జెట్‌లోనూ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షలకు పెంచినట్లే పెంచిన కేంద్ర ప్రభుత్వం, వారికి ఇప్పటివరకు కొన్ని సౌకర్యాలపై కల్పిస్తున్న మినహాయింపులపై కోత పెట్టింది. పాత విధానంలో ఉన్న హెచ్‌ఆర్‌ఎ, సిపిఎస్, 80సి, 80డి, ఇళ్ల రుణాలపై అందిస్తున్న మినహాయింపులను ఆపేసింది. దీంతో వేతనజీవులు బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్ : సిఐటియు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్మికులు, రైతులు, శ్రామికులు, సామాన్య ప్రజలకు నిరాశే మిగిల్చిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ధరల నియంత్రణ, దేశ ఆర్థిక వృద్ధి అభివృద్ధికి ఈ బడ్జెట్ సహాయపడదని తెలిపారు. ప్రయివేటు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్యమిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్లకు కేటాయింపులు పెంచలేదని పేర్కొన్నారు. ఉపాధి హామీకి కేటాయింపుల్లో కోత పెట్టిందని తెలిపారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులను కేటాయించి సంక్షేమ పథకాలను కార్మికులందరికీ అమలు చెయ్యాలన్న కోర్కెను పట్టించుకోలేదని విమర్శించారు. ఇపిఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంచాలని లక్షలది మంది వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు చేస్తున్న ఆందోళనలను కూడా మోడీ చెవికి ఎక్కలేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లోనూ రూ.61 వేల కోట్ల మేర ప్రభుత్వ సంస్థలను అమ్మాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఆర్థిక సంస్కరణల పేరుతో బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, బ్యాంకింగ్ కంపెనీల చట్టం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాలకు సవరణలు చేస్తామని చెప్పి ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయివేటీకరణకు దారులు తెరిచిందని విమర్శించారు. రోడ్లు, రైళ్ల, విద్యుత్, టూరిజం తదితర రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను అనుమతించిందని తెలిపారు.

విద్యారంగానికి అరకొర కేటాయింపులు : యుటిఎఫ్

కొఠారి కమిషన్ విద్యారంగానికి జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించాలని చెప్పినా, ప్రస్తుత బడ్జెట్‌లో 0.3 శాతం మాత్రమే కేటాయించారని, మొత్తం బడ్జెట్‌లో 2.5 శాతం కేటాయించారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. గతేడాది బడ్జెట్‌తో పోల్చుకుంటే 0.12 శాతం పెరిగినట్టు అనిపిస్తున్నా, ఈ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. విద్యారంగానికి అరకొర నిధులు కేటాయింపు చేయడం ద్వారా విద్య బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అర్థమవుతోందని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు బడ్జెట్‌లో రెండు శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా 0.7 శాతం మాత్రమే కేటాయించడం ద్వారా శాస్త్రీయ ఆలోచన కలిగిన విద్యార్థులను తయారు చేయడానికి అవరోధం కలుగుతుందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రైవేట్ రంగానికి అప్పగించే దిశగా బడ్జెట్‌లో ప్రతిపాదనలను ఆక్షేపిస్తున్నామన్నారు. పన్ను మినహాయింపునకు ఎదురుచూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందన్నారు. రూ.ఏడు లక్షల్లోపు పన్ను మినహాయింపు కొత్త పన్ను విధానానికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. బడ్జెట్ ఆమోదం పొందే లోపు పన్ను మినహాయింపును రూ.ఐదు లక్షలకు సవరించాలని, సేవింగ్స్ రూ.మూడు లక్షలకు పెంచాలని కోరారు.

పోలీసులకు ప్రత్యేక శిక్షణ

ఎస్‌పి జి.ఆర్ రాధిక



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విపత్కర పరిస్థితుల్లో శత్రు మూకలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు పోలీసు సిబ్బందికి జిల్లాలో తొలిసారిగా అర్బన్ వార్ఫేర్ ఫర్ స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిస్ శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. తండేంవలసలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో 'స్వాట్' శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రత్యేక పోలీసు విభాగం నుంచి 31 మంది పోలీసులకు ప్రత్యేక ఆయుధాలు, వ్యూహాలతో స్వాట్ టీమ్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమాండో, గ్రేహౌండ్స్ దళాల తరహాలో అంతర్గత కల్లోలాలు, తీవ్రవాదం ముప్పు తదితర తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ టీమ్ పనిచేస్తుందని చెప్పారు. ఇందులో ఇద్దరు ఆర్‌ఎస్‌ఐలతో కూడిన 31 మంది యువ సిబ్బంది ఉంటారని చెప్పారు. అత్యంత నైపుణ్యం కలిగిన ఆక్టోపస్ విభాగం శిక్షకులుతో స్వాట్ శిక్షణను 42 రోజుల పాటు ఇస్తున్నట్లు తెలిపారు. స్వాట్ జట్టు స్వీయ రైఫిల్స్ లోడింగ్, ఫిజికల్, మెంటల్ ఫిట్‌నెస్, నాయకత్వ లక్షణాలు, ఫైరింగ్ పొజిషన్, వెపన్ క్యారింగ్, స్విమ్మింగ్, హౌస్ ఇంట్రవెన్షన్, కమ్యూనికేషన్, బస్సు ఆసాల్ట్, బాంబ్ స్క్వాడ్ అండ్ బ్రీచింగ్, టాక్టికల్ ఫైరింగ్, కార్డెన్ అండ్ సెర్చ్, నైట్ ఎక్సర్సైజులు తదితర అంశాలపై కఠినమైన శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణాకాలంలో ప్రతి విషయాన్ని సూక్ష్మ కోణంలో పరిశీలించి, నైపుణ్యం గల కమాండోలుగా సిద్ధం కావాలని ఆకాంక్షించారు. శిక్షణ కాలంతో పాటు శిక్షణ అనంతరం కూడా ప్రత్యేక టిఎతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. ప్రతి కమాండో పది మంది కమాండోలను తీర్చిదిద్దేలా శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్మ్డ్ డిఎస్‌పి డి.ప్రసాదరావు, యూనిట్ వైద్య అధికారి సిహెచ్.విజయ్ కుమార్, సింగపురం సిహెచ్‌సి డాక్టర్ ఐ.వెంకటేష్, ఆర్‌ఐలు ఉమా మహేష్, ప్రదీప్, ఆక్టోపస్ ఆర్‌ఐ శివాజీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భావనపాడు తీరానికి డ్రోన్ జెట్

మెరైన్ పోలీసులకు అప్పగించిన మత్స్యకారులు



బోటుపై మత్స్యకారులు తెచ్చిన డ్రోన్ జెట్

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు సముద్ర తీరంలో బుధవారం ఉదయం విదేశీ డ్రోన్ జెట్ (బాన్షీ జెట్) లభ్యమైంది. మూలపేట, భావనపాడు మధ్య చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులకు సముద్రంలో తేలియాడుతూ కనిపించింది. దీన్ని గుర్తించిన మత్స్యకారులు బోటులో భావనపాడు తీరానికి చేర్చారు. మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో భావనపాడు మెరైన్ సిబ్బంది హుటాహుటిన చేరుకొని డ్రోన్ జెట్‌ను పరిశీలించారు. దీన్ని ఎవరు ప్రయోగించారు? ఎక్కడి నుంచి వచ్చింది అన్న విషయాలను ఆరా తీస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నారు. జెట్‌లా ఉన్న దీన్ని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఫోటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీనికి సంబంధించి ఇంటర్నెట్‌లో వివరాలను ఆరా తీస్తున్నారు. దీని బరువు 111 కేజీలుగా, 28.1.2023 తేదీ రాసి ఉంది. ఇది జనవరి 28వ తేదీన ప్రయోగించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్న వివరాలతో ఇది అమెరికాలో తయారైందని భావిస్తున్నారు. ఇది విదేశీ వైమానిక దళంలో శిక్షణ ఇచ్చేందుకు, డ్రోన్‌లా ఉపయోగించి టార్గెట్ సర్వే చేసేందుకు దీన్ని ఉపయోగిస్తారని చెప్తున్నారు. గతంలో ఇదే మండలంలోని ఎం.సున్నాపల్లి తీరానికి విదేశీ మందిరం కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. అక్కడికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఇప్పుడు జెట్ కొట్టుకొచ్చింది.

దీనిపై మెరైన్ సిఐ దేవుళ్ళు మాట్లాడుతూ ఇది దేశ రక్షణలో భాగంగా మిలటరీ దళాలు ప్రయోగిస్తాయని, అవి విఫలం కావడంతో సముద్రంలో పడిపోతాయని తెలిపారు. దీని పొడవు 9 అడుగులు, బరువు 111 కిలోలు ఉందని తెలిపారు. దీనిపై ఇండియన్ నేవీ అధికారులకు, కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీనిపై పూర్తి వివరాలు ఆరా తీస్తున్నామని తెలిపారు.

రేషన్‌లో రాయితీపై గోధుమపిండి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రేషన్‌కార్డుదారులకు రాయితీపై రెండు కేజీల గోధుమపిండిని ఈనెల నుంచి అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. నిత్యావసర సరుకులతో పాటు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన ప్రతి రేషన్‌కార్డుదారునికి రెండు కేజీల గోధుమపిండిని నగరంలోని ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఎండియు వాహనం ద్వారా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, పంచదారతో పాటు ప్రతి కార్డుదారునికి రూ.80 విలువ చేసే రెండు కేజీల గోధుమ పిండిని సబ్సిడీపై రూ.32కే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సరుకులను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వి రమణ, తహశీల్దార్ కె.వెంకటరావు, సిఎస్ డిటి షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సంకల్ప దీక్ష'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 3న యుటిఎఫ్ ఆధ్వర్యాన కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో ధర్మస్థలి ప్రాంగణంలో చేపట్టనున్న సంకల్ప దీక్ష సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 'సంకల్ప దీక్ష' పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తానని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. కొత్తగా గ్యారంటీ పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రతిపాదించడం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గ్యారంటీ పెన్షన్ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేర్చినప్పటికీ అది ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం భద్రత కలిగించేదిగా లేదన్నారు. పాత పెన్షన్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం లేదని, పశ్చిమబెంగాల్‌లో మొదటి నుంచి పాత పెన్షన్ విధానం కొనసాగిస్తుండగా రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్కండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాయన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇటీవల హిమాచల్‌ప్రదేశ్ నూతన ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. తమిళనాడులో 2023 ఏప్రిల్ ఒకటి నుండి పాత పెన్షన్ విధానం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ఈ సంకల్ప దీక్షలో అత్యధిక మంది పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జి.గిరిధర్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, జి.సురేష్‌కుమార్, జిల్లా నాయకులు పి.అప్పలనాయుడు, జి.విశ్వనాథం, కె.వెంకటరావు, కె.నాగేశ్వరరావు, జి.జనార్ధనరావు, కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆక్వా'కు విద్యుత్ రాయితీ

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టరు శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉన్న ఆక్వా రంగాన్ని అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. బుధవారం రాత్రి మత్స్యశాఖ ఆధ్వర్యాన జిల్లా కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆక్వా జోన్ పరిధిలో 1600 ఎకరాల విస్తీర్ణంలో 547 మంది ఆక్వా రైతులు సాగు చేస్తున్నారని, వారికి ప్రభుత్వం నుంచి విద్యుత్ రాయితీ లభిస్తోందన్నారు. నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్న 392.06 ఎకరాల్లో సాగు చేస్తున్న 252 మంది రైతులకు విద్యుత్ రాయితీ అందించేందుకు అనువైన పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అటవీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు అన్ని విధాలా సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మత్స్యశాఖ డిడి ఎ.వి.శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదులో విధులెలా?

ప్రజాశక్తి - నందిగాం

సచివాలయం ఉద్యోగులతో పాటు వాలంటీర్లు కలిసి 28 మంది ఈ చిన్న భవనంలో ఎలా విధులు నిర్వర్తిస్తున్నారని, పూర్తయిన కొత్త సచివాలయ భవనంలోకి మారాలని కలెక్టర్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు ఈ మేరకు బుధవారం సాయంత్రం మండలంలోని పెద్ద తామరపల్లి, నందిగాం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సమగ్ర భూ సర్వే అడిగి తెలుసుకున్నారు ఎంత మంది రైతులు ఉన్నారని, వారిలో ఎంతమందికి హక్కు పత్రాలు ఇచ్చారని, ఎంతమందికి లబ్ధి చేకూరిందని ఆయన విఆర్‌ఒ కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు సచివాలయం పరిధిలోని చిన్నారి వాకర్రపల్లిలో 423 మంది రైతులతో సర్వే నిర్వహించామని, వాటిలో 93 మందికి పత్రాలు అందించామని, 40 మంది వరకు సంతృప్తి వ్యక్తపరిచినట్లు ఆయన తెలిపారు. మిగతా 53 మంది గతంలో పుస్తకాల ఉన్న వారని ఆయన తెలిపారు ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని, దాన్ని తూచా తప్పక పాటించాలని విఆర్‌ఒను ఆదేశించారు. మీ పరిధిలో ఎన్ని ఎకరాలు ఉన్నాయని, ఇంతవరకు ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్‌ను కలెక్టర్ ప్రశ్నించారు 1300 మెట్రిక్ టన్నుల ధాన్యం టార్గెట్ కాగా, ఇప్పటివరకు 893 మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేశామని బదులిచ్చారు. ఎఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలలను తనిఖీ చేయకపోవడంతో వారికి మెమో జారీ చేయాలని ఎంపిడిఒ హెచ్‌వి రమణమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలోని ప్రతి పాఠశాలనూ పర్యవేక్షించాలని ఎంఇఒ జి.నరసింహులను ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ-క్రాప్ నమోదు చేయాలని, ఖరీఫ్‌లో పండిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ట్రక్కు సీట్ వచ్చిన చోటకు ధాన్యం పంపించే వీలు కల్పించామని అన్నారు. ప్రభుత్వమే రవాణా ఛార్జీలు భరిస్తుందని తెలిపారు.

గ్రామ సచివాలయం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఇఒపిఆర్‌డి రాజారావుపై అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. నిబంధనలు పాటించని దుకాణదారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామంలో ఆరుగురు రైతులు 60ఏళ్ల క్రితం పచ్చిక బయళ్లకు పట్టా ఇచ్చారని,భూ సర్వేలో వారి అర్హత, పట్టాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్‌తోపాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటి జిల్లా పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. అనకాపల్లి వేదికగా గత నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ తరపున పాల్గొన్న క్రీడాకారులు సత్తా చాటారు. నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహం వద్ద పతకాలు సాధించిన పలు విభాగాలకు చెందిన బాలబాలికలను బుధవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా క్రీడలకు ఖిల్లా అన్నారు. జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని తైక్వాండో క్రీడాకారులు జిల్లా కీర్తిని దశదిశలా చాటాలన్నారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ క్రీడాకారులను అభినందించారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులతో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన పలు విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలు దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను తెలిపారు. జూనియర్స్ విభాగంలో విశాఖపట్నం వేదికగా ఈనెల 3, 4, 5 తేదీల్లో 12వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 38వ సీనియర్ జాతీయ తైక్వాండో పోటీలను ఈనెల 10, 11, 12 తేదీల్లో పాండిచ్చేరిలో, 5వ క్యాడెట్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు ఈనెల 24, 25, 26 తేదీల్లో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు ఆయా విభాగాల్లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైశ్యరాజు మోహన్, జి.వెంకటేశ్వరరావు, కొంక్యాన వేణుగోపాల్, ఎం.సుధీర్ వర్మ, షేక్ అబ్దుల్లా, కోచ్‌లు నవీన్, గౌతమ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


విజేతలకు ట్రోఫీని అందిస్తున్న వసంతరెడ్డి

కబడ్డీ విజేత యామలపేట

ప్రజాశక్తి- నౌపడ

మండలంలోని హనుమంతు నాయుడుపేటలో అభయాంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలో యామలపేట జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఆకాశలక్కవరం జట్టు ద్వితీయం, సుగ్గువానిపేట జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ విజేతలకు జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, నిర్వాహకులను ఆయన అభినందించారు. క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పాల మహేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కర్‌రావు , రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ సుగ్గు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ధనుంజయరెడ్డి, సీరపు నర్సింహమూర్తి, గిన్ని ప్రకాష్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఫెన్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు

కోటబొమ్మాళి: కర్నూలులో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు అండర్-14, 17 విభాగాల్లో నిమ్మాడ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన సాబర్‌లో ఇప్పిలి తేజస్వినికి సిల్వర్ మెడల్ సాధించారు. ఇప్పిలిలో రేగులపాడు కళ్యాణికి బ్రాజ్ మెడల్, అండర్-17లో కొరచాడ కోటమ్మకు బ్రాంజ్ మెడలు పతకాలను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాగోటి రామక్రిష్ణ బుధవారం తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ఈ పతకాలు సాధించటం పట్ల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అనితశ్రీ, సహోపాధ్యాయులు గండెపల్లి శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉషా, ఛాయ, పద్మినీ సమేతుడైన ఆదిత్యుని కళ్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. మాఘ శుద్ధ ఏకాదశిని (భీష్మ ఏకాదశి) పురస్కరించుకుని ఈ కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ వేడుకుల్లో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.


కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విరాళం అందజేత

నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన పివిఎస్‌విఎస్ గోపినాథ్, రమ్య దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌కు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.లక్షలు కురిపిస్తున్న మట్టి దందా

- ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి దందా రూ.లక్షలు కురిపిస్తోంది. ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపట్టి కొండలను కరగేస్తున్నారు. ట్రాక్టర్లతో రాత్రి, పగలు అన్న తేడా లేకుండా తరలిస్తున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకపోవడంతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

పలాసలోని నెమలి కొండ, కాశీబుగ్గలోని పలు కొండలను భారీ యంత్రాలతో తవ్వి పిండి చేస్తున్నారు. రూ.లక్షలు విలువ చేసే కంకరను తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి ప్రభుత్వ స్థలాలు, కొండ ప్రాంతాల్లో కంకర తవ్వకాలు చేపట్టాలంటే ముందస్తుగా రెవెన్యూ, మైన్స్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ప్రభుత్వానికి చలానా రూపంలో డబ్బులు చెల్లించాలి. కానీ కంకర మాఫియా అవేమీ చేయకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


రామకృష్ణాపురం లేఅవుట్ సమీపంలో తవ్విన కంకర

ఇటు ప్రభుత్వం, అటు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా, చలానా కట్టకుండా ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపడుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రామకృష్ణాపురం జగనన్న లేఅవుట్ సమీపంలో భారీ యంత్రాలతో రాత్రి సమయంలో తవ్వకాలు చేపడుతున్నారు. జగనన్న లేఅవుట్ సమీపంలో ఆ ప్రాంతమంతా కొండలా కనిపించేదని, ప్రస్తుతం దాని రూపురేఖలే మారిపోయాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో కంకర తరలిస్తున్నారని, వాటి వల్ల రాత్రి సమయంలో నిద్ర లేకుండా పోతుందని, ఏం చేయాలో ఎవరు చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఉంటున్నారు. రోజుకు సుమారు 100 లోడులు వరకు కంకర తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక లోడు కంకర రూ. 600 నుంచి రూ. 800 వందల వరకు ధర పలుకుతోంది. ఈ విధంగా రోజుకు సుమారు లక్ష రూపాయల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం కోసం కంకర తరలించేందుకు ముందుగా లక్షల్లో బేరం కుదుర్చుకుని అనుకున్న సమయానికి కంకర తరలించి కంకర మాఫియా సొమ్ము చేసుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుండడంతో పంట భూములను లేఅవుట్లుగా మార్చే ప్రాంతాలలో మట్టితో పాటు కంకర తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వానికి చెందాల్సిన ఆదాయం కంకర మాఫియా చేతుల్లోకి వెళ్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి కంకర అక్రమంగా తరలిపోకుండా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఆదాయం వచ్చేలా చూడాలని పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కంకర అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు ప్రభుత్వ స్థలాలు, కొండ ప్రాంతాల్లో కంకర తవ్వకుండా చూస్తాం. రామకృష్ణ పురం లేఅవుట్ సమీపంలో రాత్రి సమయంలో కంకర తరలిస్తున్నా సమయాల్లో దిగువ స్థాయి అధికారులను పంపి తవ్వకాలు జరుగకుండా చూస్తా.

- ఎల్.మధుసూదనరావు, తహశీల్దార్


పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జనరంజక పాలన వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- జలుమూరు

జనరంజక పాలన వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ధర్మాన పద్మప్రియ అన్నారు. బుధవారం బొడ్డపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ఆరా తీశారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి మరోసారి సిఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనర్ కనుసు సీతారాం, అల్లాడ చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్లు పొన్నాన ముసలినాయుడు, పాగోటి రాజప్పలనాయుడు, సర్పంచ్ అంపోలు భాను, తిరుపతిరావు, వైసిపి నాయకులు మొజ్జాడ శ్యామలరావు, ధర్మాన జగన్మోహన్‌రావు, తండ్యాల సుధబాబు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

జి.సిగడాం : మండలంలోని పాలఖండ్యాంలో మండల సచివాలయం కన్వీనర్లకు, గృహ సారథులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. వైసిపి ప్రత్యేక పరిశీలకులు నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ నవరత్నాలు పేదలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, జగనన్న, సచివాలయం కన్వీనర్, గృహ సారథుల మండల ఇన్‌ఛార్జి డోల వెంకటరమణ, వైస్ ఎంపిపి తోలేటి వెంకటరావు, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేఇ ప్రకాష్ సర్పంచ్ దారబోయిన వెంకటప్పారావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని అదపాక సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వైసిపి ప్రత్యేక పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల కన్వీనర్ డి.రాజినాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, గొర్లె అప్పలనాయుడు, నడిమింటి కుమారి పాల్గొన్నారు.


జి.సిగడాం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

వైసిపి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర శివారుల్లోని పెద్దపాడు సమీపంలో 1.5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించనున్న వైసిపి జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ దంపతులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజులు పాల్గొన్నారు.. జిల్లా నలుమూల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా సదుపాయంగా ఉండేటట్లు ఈ భవన సముదాయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి శీతంరాజు సుధాకర్, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మోడల్ స్కూల్ విద్యార్థి వై.దిలీప్ ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. అండర్-14 విభాగం 400 రిలే పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పిఇటి సిహెచ్ జైమారావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ

సంక్షిప్త వార్తలు

నేడు స్పీకర్ పర్యటన



శ్రీరామ్మూర్తి

ఆమదాలవలస : మండలంలోని హనుమంతపురం, ఇసకలపేట గ్రామాల్లో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సిసి రోడ్లను గురువారం శంకుస్థాపన చేస్తారని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకూ రోడ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన కమ్మసిగడాం జాతర

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో సోమవారం ప్రారంభమైన మహాలక్ష్మితల్లి జాతర బుధవారంతో ముగిసింది. ఈ మూడు రోజులు కిక్కిరిసే యాత్రికులతో ఆలయం జనసందోహంగా మారింది. అలాగే ఈ సారి జాతరకు విదేశీయులు, రాజకీయ పార్టీ నాయకులు వచ్చి దర్శంచుకున్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సిఐ ఎస్.ఆదాం, ఎస్‌ఐ జి.రాజేష్ ఆధ్వర్యాన ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు.

వైసిపి బలోపేతానికి కృషి


కృష్ణారావు

పొందూరు: క్షేత్రస్థాయిలో వైసిపి మరింతగా బలోపేతానికి కృషి చేస్తానని మండల సమన్వయకర్త బాడాన కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసుకొని పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు. తనను మండల సమన్వయకర్తగా నియమించిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్‌కు కృతజ్ఞతలను తెలిపారు.

గీత భవనం ప్రారంభం

టెక్కలి రూరల్: పట్టణంలోని కొండ్రవీధిలో జామి కమల, గణపతి జ్ఞాపకార్థం కుమారుడు వెంకటేశ్వరరావు, మాధవీలత దంపతులు గీత భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణానికి రూ.25 లక్షలు సమకూర్చారు. గీతోపదేశం, గీత పరాయనం, గీత యజ్ఞం ఏర్పాటు చేశారు. గీత భవనం ప్రారంభం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.


గాంధీతో మాట్లాడుతున్న కార్మికశాఖ అధికారులు

కాన్‌కాస్టు కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు చర్యలు

సిఎంకు ధన్యవాదాలు తెలిపిన గాంధీ

ప్రజాశక్తి- పొందూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు దూసి కాన్‌కాస్టు కార్మికులకు బకాయిలు, అలవెన్స్‌లు చెల్లించేందుకు కార్మికశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతుండడంపై వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నం కార్మికశాఖ జాయింట్ కమిషనర్ ఆదేశాలు మేరకు జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయలు బుధవారం వి.ఆర్.గూడెంలో గాంధీ స్వగృహంలో కలిసి కాన్‌కాస్టు కార్మికుల బకాయిలు చెల్లింపులపై చర్చించారు. 2017 నవంబరులో కాన్‌కాస్టు పరిశ్రమ మూసివేయడంతో పాటు, బకాయిలూ యాజమాన్యం చెల్లించకపోవడంతో 700 కార్మిక కుటుంబాలు రోడ్డునపడ్డాయని, కార్మికులను ఆదుకోవాలని కోరుతూ గతేడాది సెప్టెంబరులో సిఎంకు వినతిపత్రం అందజేశామని అన్నారు. పరిశ్రమ మూసివేయడానికి ముందు ఆరు నెలల బకాయిలు, అలవెన్స్‌లు రూ.10కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. కొద్ది రోజుల్లో ఈ మొత్తాన్ని కార్మికులకు చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు ఆయనకు తెలిపారు. దీంతో బకాయిలు చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టడంపై సిఎంకు కార్మికుల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు కాన్‌కాస్టు కార్మికులు ఆర్.వి.రాఘవేంద్ర, కూన శ్రీనివాసరావు, ఎల్.సత్యం, బి.మోహనరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సిడిపిఒ కార్యాలయంలో సిడిపిఒ కె.శ్రీలతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీల ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. రకరకాల యాప్‌లను తీసుకువచ్చి అంగన్వాడీ లపై పనిభారం మోపవద్దని, సకాలంలో జీతాల ను చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి మృతి చెందిన అంగన్వాడీల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించి బీమాను అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌ను మంజూరు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని విన్నవిం చారు. అలాగే తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి.భూలక్ష్మి, పి.లతాదేవి, కె.వి.హేమలత, ఎం.లత, లక్ష్మి, సునీత కనకం, మాధవి, రమణ మ్మ, సుదీస్నా, కె.జ్యోతి, బి.ఉమ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఇంటి పన్నులు రద్దు చేయాలి

బూర్జ: ఇంటి పన్నులను తక్షణమే రద్దు చేయాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వావిలి పెళ్లి సీతారాం బాబునాయుడు, నాయకులు రాజీరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్లెన ప్రజల తరుపున కార్యదర్శి రాజారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారమని అన్నారు. ఈ రోజు వారీ కూలీలకు వాలంటీరు వచ్చి ఇంటి పన్నులు చెల్లించాలని తాకీదిలు ఇచ్చారని పేర్కొన్నారు అయితే ఆ పన్ను మేము కట్టలేమని, తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వారాడ రాంబాబు, శంకరరావు, హరిబాబు, గోవింద, ఆంజనేయులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మిశ్రమ ఫలాల బడ్జెట్


మోహనరావు

ఆమదాలవలస : కేంద్ర బడ్జెట్ మిశ్రమ ఫలాల బడ్జెట్‌గా ఉందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై బుధవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నట్లు ఈ బడ్జెట్ ఏమాత్రం విప్లవాత్మకమైనది కాదన్నారు. వేతన జీవులు కొంత మేరకు ఊరట పొందే అవకాశం ఉందని, ఆదాయపు పన్ను పరిమితి పెంపు ఊరట కల్పించిందని అన్నారు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ కేటాయింపులు ఆశాజనకంగా లేవన్నారు. పరిశోధనలకు ప్రోత్సాహకాలు తక్కువగా ఉన్నాయని అన్నారు. వ్యవసాయ, ఆహార భద్రత, రైతుల పంటకు గిట్టుబాటు ధరల గ్యారెంటీ స్పష్టత లేదని పేర్కొన్నారు.

ఆంధ్రాకు ప్రయోజనం లేని బడ్జెట్


శ్రీనివాస పట్నాయక్

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాకర్షణ పథకాల కు తుంగలో తొక్కిందని వైసిపి గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ అన్నారు. వెనుకబడిన ఆంధ్రాపై ఎటువంటి ప్రేమ చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి రూ.5,300 కోట్ల సహాయం ప్రకటించి లబ్ధిపొందాలని చూస్తుందన్నారు. మొబైల్, ఎలక్ట్రానికల్ వస్తువు సుఖం తగ్గించి టైర్ల ధరలు బ్రాండెడ్ వస్తువుల ధరలు పెంచిందన్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై ఎటువంటి రాయితీ ప్రకటించలేదనానరు. ఇది సామాన్యులకు ఉపయోగం లేని బడ్జెట్ అని తెలిపారు.


ఒకరికి గాయాలు

నందిగాం: మండలంలోని పాలవలస జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మద్దిలివానిపేట గ్రామానికి చెందిన మాధు, చిన్నారావు తమ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అదే రహదారిలో పలాస నుండి టెక్కలి వస్తున్న కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న విజయ

ప్రజాశక్తి- జలుమూరు

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామిని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆమెకు స్థల మహత్యం, ఆలయ నిర్మాణ గాథలను వివరించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ శిఖర దర్శనం చేసుకున్నారు. ఆలయ గోడలపై ఉన్న శిల్పసంపదను చూసి మంత్రముగ్ధులయ్యారు.


దర్శించుకుంటున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ


మాట్లాడుతున్న సూరయ్య

కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య అన్నారు. బుధవారం చాపర సిఐటియు కార్యాలయంలో జట్టు కళాసీ సంఘం విస్తృత స్థాయి సమావేశం డి.దామోదర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూరయ్య మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కళాసీలకు సమగ్ర చట్టం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, కార్మిక హక్కులను కాలరాసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఈ నెల 5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి షణ్ముఖరావు, పలువురు కళాసీలు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగదీశ్వరరావు

ట్రిపుల్ ఐటి ఆంగ్ల ఆచార్యునికి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిలో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ రాకోటి శ్రీనివాసరావుకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు) ఈ నెల 27న ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేశారు. ఆచార్య వి.బి.చిత్ర పర్యవేక్షణలో 'ఏ క్రిటికల్ ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ థీమ్స్ ఇన్ ది సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ చమన్ నహల్' అన్న సిద్ధాంత పత్రాన్ని ఆయన సమర్పించారు. శ్రీనివాసరావు ట్రిపుల్ ఐటి నూజివీడులో 11 ఏళ్లుగా పనిచేసి 2020లో శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వచ్చారు. ఆయన స్వస్థలం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం చిత్తరపురం గ్రామం. పిహెచ్‌డి పొందడానికి ఎంతగానో సహకరించిన తన కుటుంబం, గైడ్ ప్రఫెసర్ వి.బి.చిత్ర, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జగదీశ్వరరావు, డీన్ మోహనకృష్ణ చౌదరిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


బహుమతిని అందజేస్తున్న తనికెళ్ల భరణి

తేజలక్ష్మికి తనికెళ్ల భరణి ప్రశంసలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రోటరీక్లబ్ పట్టణ కార్యదర్శి పల్లె తేజలక్ష్మిని సినీ దిగ్గజం తనికెళ్ల భరణి ప్రశంసించారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3020 జిల్లా గవర్నర్ ఎ.కె.ఎస్.భాస్కరరామ్ బృందం రాజమండ్రిలోని మంజీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ హోటల్‌లో రోటరీ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ ఆనందితం-2023ను బుధవారం నిర్వహించారు. కాన్ఫరెన్స్ రెండో రోజు తనికెళ్ల భరణి ప్రశ్నావళిని తేజలక్ష్మి ప్రశ్న వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంప్రదాయం పద్ధతి గల అమ్మాయిని రోటరీ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు సీనియర్ రోటరీ మెన్స్‌కు అభినందించారు. ఈమెకు ఉద్యోగన్నతి కల్పించిన జిల్లా శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తేజలక్ష్మి కాన్ఫరెన్స్ బహుమతిని అందజేశారు.

కిడ్నీ రోగులకు అండగా ఉంటాం

కవిటి: కిడ్నీ రోగులకు అండగా ఉంటామని బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. పంచాయతీలో నూతనంగా మంజూరైన డయాలసిస్ పింఛన్లను ఎంపిటిసి దుద్ది సతీష్‌తో కలిసి ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ రోగుల కోసం కిడ్నీ పరిశోధనా కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీపతి, బల్లేడ శ్రీను, విశ్వనాథం, తేజేశ్వరరావు, గున్న శ్రీను, కాళీ, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పాలవలసలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బెవిరిశెట్టి సంతోషికి కొత్త పింఛనను సర్పంచ్ అల్లు అంబుజాక్షి, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జల్లు హైమావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సంకల్ప దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పాత పింఛను సాధన కోసం ధర్మస్థలిలో యుటిఎఫ్ చేపట్టిన సంకల్ప దీక్ష పోస్టర్‌ను ఎంఇఒ కార్యాలయం ఆవరణలో యుటిఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదని, ఒపిఎస్ మాత్రమే అని సిపిఎస్ జిల్లా కన్వీనర్ నారాయణరావు డిమాండ్ చేశారు. ఈనెల 3న ధర్మస్థలిలో జరగనున్న సంకల్ప దీక్షలో జిల్లా నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వై.వాసుదేవరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, సింహాచలం, చంద్రమోహన్, హరిహరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుడా కార్యాలయానికి శాశ్వత భవనం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) కార్యాలయ నిర్వహణకు శాశ్వత భవనం ఉండాలని, ఇందుకు సంబంధించిన పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సుడా బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు అద్దె భవనంలో ఉన్న సుడా ఇకపై శాశ్వత భవనంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి సంబంధించిన బోర్డు అనుమతితో ప్రతిపాదనలను సమర్పించాలన్నారు. వంశధార కార్యాలయం ఆవరణలో సుమారు 30 సెంట్ల ఖాళీ స్థలాన్ని గుర్తించి అక్కడ నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. సుడా వద్ద అందుబాటులో ఉన్న నిధులతో భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన సుడాకు ఛార్టర్డ్ అకౌంటెంట్ తాత్కాలిక పద్ధతిలో సిఎను నియమించుకోవాలని సూచించారు. మూడు జిల్లాల వరకు సుడా విస్తరించినందున, అందుకు తగిన విధంగా కొత్త మ్యాపును తయారు చేయాలన్నారు. ఈ మ్యాపులో పరిశ్రమలు, రహదారులు, నీటి వసతులు తదితర అంశాలన్నీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతవరకు సుడాకు లేని డెలిగేషన్ ఆఫ్ పవర్స్‌ను ఇకపై వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జగనన్న టౌన్ షిప్ కింద సుడా కొనుగోలు చేసిన 150 ఎకరాల స్థలానికి చుట్టూ కంచె వేయాలన్నారు. ఇందులో 20 ఎకరాల వంతున ఎంఐజిలకు కేటాయించి, వాటిని నిర్మించేందుకు టెండర్లను ఆహ్వానించాలన్నారు. దూరదృష్టితో శ్రీకాకుళం నగరంలోని రహదారులను అభివృద్ధి చేసి మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు.

సుడా ప్లానింగ్ అధికారి టి.జి.రామ్మోహనరావు మాట్లాడుతూ సుడా పరిధిలో శ్రీకాకుళంతో పాటు విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని 37 మండలాలు, 1647 గ్రామాలు, ఆరు మున్సిపాలిటీలతో కలిపి 5,294.68 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం వరకు విస్తరించి ఉందని వివరించారు. సమావేశంలో సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, ఆర్అండ్‌బి ఎస్ఇ కె.కాంతిమతి,. కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.శంకర్ నాయక్, సుడా కార్యదర్శి బి.రమణమ్మ, పరిపాలన అధికారి సిహెచ్.శాంతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ప్రాధాన్యం


మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

కోటబొమ్మాళి: తమ పంచాయతీ ప్రజలకు తాగునీటికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీ శివారున ఉన్న రెండు ఇళ్లకు కూడా ప్రత్యేకంగా పైపులైను వేసినట్లు సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. మేజరు పంచాయతీ పరిధిలోని పెద్ద పొందరవీధిలో ఏడు కుటుంబాలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తనకు చెప్పడంతో పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావుతో మాట్లాడి వెంటనే వారి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రస్తుతం పంచాయతీలో తాగునీటి సమస్య లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో 2వ వార్డు ఇన్‌ఛార్జి బెవర కృష్ణారావు, వైసిపి నాయకులు ఇర్రి చిరంజీవి, పోతభక్తుల అనురాధ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: పట్టణంలోని కండ్రా వీధికి చెందిన నిరుపేద కుటుంబానికి బెల్లుపడా యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాబులా బెహరా కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. విషయం తెలుసుకున్న యూత్ సభ్యులు ఆర్థిక సాయం అందించి, దాతృత్వం చాటుకున్నారు. యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


భోజనశాలను ప్రారంభిస్తున్న ఎంఇఒ,నాయకులు

పాఠశాల అభివృద్ధికి విరాళం

నౌపడ: సంతబొమ్మాళి మండలం ఎం.సున్నాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు అందజేసిన రూ.లక్ష విరాళాలతో భోజనశాల ఏర్పాటు చేశారు. ఎంఇఒ చిన్నవాడు, హెచ్‌ఎం ఎం.శివప్రసాద్ భోజనశాలను బుధవారం ప్రారంభించారు. అర్జాల చిరంజీవులు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు తేజేశ్వరరావు సర్వేపల్లి రాధాకృష్ణ, గాంధీ విగ్రహాలను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. వీటిని వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, సర్పంచ్ ప్రతినిధి నారాయణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కనకరాజు, కమిటీ చైర్మన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కొత్తూరు : మండలంలోని బలదలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్ సారిపల్లి భారతిలు బుధవారం ఆధార్ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రం బలద, కడుమ, హంస, కౌసల్యాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు అందుబాటులో ఉంటుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు, నివగాం వెళ్లి వ్యయప్రయాసలకు గురయ్యేవారు.

యోగాతో మానసిక ప్రశాంతత

పోలాకి : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందనితాడి దాలెమ్మ, యర్రయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రజాగ్రంథాలయం నిర్వాహకులు తాడి ఎర్రయ్య అన్నారు. బుధవారం ప్రజా గ్రంథాలయంలో 16 మంది విద్యార్థులకు మండల స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వెదుళ్లవలసకు చెందిన బి.సుధాకర్, పోలాకికి చెందిన వి.జీవన్‌కుమార్, గంగివలసకు చెందిన బి.సాయికుమార్ వరుస మూడు స్థానాల్లో నిలిచారు. వారికి యర్రయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దుర్గారావు, యోగా గురువు అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎర్రయ్య

లెప్రసీపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఎన్‌టిఆర్ నగరపాలక సంస్థ హైస్కూల్‌లో బుధవారం లెప్రసీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ లెప్రసీ యూనిట్ అధికారి సాంబమూర్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శరీరంపై తెల్లమచ్చలు రావడంతో పాటు ఆ ప్రదేశంలో స్పర్శలేక పోవడం లెప్రసీ వ్యాధి లక్షణమని అన్నారు. అటువంటి మచ్చలు ఉంటే తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా వర్కర్లు, పాఠశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అశోక్

వధూవరులకు ఆశీర్వాదం

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి మండలాల్లో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో బుధవారం పాల్గొన్నారు. ఈ మేరకు నూతన వధూవరులకు ఆశీర్వదించారు. అనంతరం భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఆయా మండలాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపిపి

ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని భోగాబేని పంచాయతీ జెన్నాపాయి గ్రామానికి చెందిన ఘనప భీమయ్య, గుమ్మడి అబ్బాయి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఎంపిపి దేవదాసురెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, నాయకులు డి.ధర్మారావు, డి.మోహనరావు, జి.తాతయ్య, సర్పంచ్ గనప సింహాచలం పాల్గొన్నారు.

చీడపీడల నివారణతోనే అధిక దిగుబడులు


అరటి పంటను పరిశీలిస్తున్న భగవాన్

ప్రజాశక్తి- బూర్జ

చీడపీడల నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని పెద్దపేట ఉద్యాన పరిశోధన క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త బి.వి.కె.భగవాన్ అన్నారు. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వైస్ ఛాన్సలర్ టు విలేజ్ ప్రోగ్రాంలో భాగంగా మండల కేంద్రం బూర్జలో ఉద్యాన పంటలైన అరటి, మిరప, టమోటా, బెండ, వంగ తదితర పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు చీడపీడలు ఆశిస్తున్నాయని, వాటిని నివారించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. రైతులు ఉద్యాన వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేశ్వరరావు ఉద్యానవన శాఖ అధికారిని అయ్యంతి, ఆర్‌బికె సిబ్బంది, విఎఎ వసంత, ల్యాబ్ టెక్నీషియన్ మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- కంచిలి

రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కంచిలి ఎస్ఐ చిరంజీవి బుధవారం అవగాహన కల్పించారు. కంచిలి రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద సాయంత్రం హెల్మెట్ వాడకం, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, హెల్మెట్ వాడటం ద్వారా ప్రాణాపాయస్థితి నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బారువ ఎస్ఐ సత్యనారాయణ బుధవారం అవగాహన కల్పించారు. కొర్లాం జంక్షన్ వద్ద సాయంత్రం హెల్మెట్ వాడకం, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.


సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి

బీమా అందజేత

ఆమదాలవలస : పేదలకు అండగా వైఎస్ఆర్ బీమా ధీమానిస్తుందని వైసిపి వార్డు కన్వీనర్ సనపల రాజు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ఆరో వార్డు తురకపేటకు చెందిన గంగు అమ్ములు గత నెల 30న మృతి చెందారు. ఈ మేరకు నామినీ అయిన ఆమె భర్త రామారావుకు తక్షణ సహాయం కింద రూ.పది వేలును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రెటరీ మెండ రమేష్, వార్డు వాలంటీర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

కొత్తూరు : మండలంలోని గిరిజన పంచాయతీలైన అడ్డంగి, గొట్టిపల్లి, పుల్లగూడల్లో రైతులు పండించే పంటలను కొనుగోలు చేసే కలెక్షన్ సెంటర్లను ఉద్యానవనశాఖ జిల్లా అధికారి ఆర్.వి.ఎస్.ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ మేరకు తోటబడి కార్యక్రమంలో భాగంగా జీడీ, మామిడి పండించే గిరిజన రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ మండల అధికారి ఎన్.మంగమ్మ అయింతి, సర్పంచ్ ఎన్.కళావతి, వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు, రామకృష్ణ, వి.వి.ఎ.శ్రీలక్ష్మి, నిహారిక, కె.బి.ఎస్.దివాకర్ పాల్గొన్నారు.